క్లుప్తంగా

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ


పుస్తకాలు, పెన్నులు పంపిణీలో చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: స్థానిక కాశిరెడ్డి(గిరిజన) కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బురెడ్డి స్రగ్వీతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు, పలకలు, పుస్తకాలు, నోటుబుక్‌లు, పెన్నులు గురువారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల మధ్య జన్మదిన కేక్‌ను కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు మంద్రు రమేష్, మంద్రు ప్రవీణ్ కుమార్, నవకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న షైన్ ఫౌండేషన్ ప్రతినిధులు

కందుకూరు: షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణ శివారు ప్రాంతాల్లో నిరుపేదలకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షైన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీం మాట్లాడుతూ మూడేళ్లుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతినిధులు నయీమ్‌భాష, వెంకటేశ్వర్లు, కరిముల్లా, డాక్టర్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ విధిగా అమలుచేయాలి


మధ్యాహ్న భోజన నాణ్యతన పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ విధిగా అమలుచేయాలని ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. సీఎస్‌పురం ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించిన ఆయన పాఠశాలకు వచ్చే విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: స్థానిక షిరిడి సాయిబాబా దేవస్థానంలో అఖండ సాయి నామ సప్తాహం పూజల్లో భాగంగా 6వ రోజు ప్రత్యేక అభిషేకాలు, విశిష్ట పూజలు జరిగాయి. శ్రీ సాయి సేవా మహిళా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో భిక్షా కార్యక్రమం జరిగింది. అనంతరం మున్సిపల్ కార్మికులకు, గిరిజన కాలనీలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మ, టంగుటూరు గోవిందరావు, ఏసీ చెంచులు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి, మండల వెంకటేశ్వర్లు, బద్వేటి కృష్ణ మూర్తి, ఇన్నమూరి సుబ్బారావు, ఆర్ సంజీవయ్య, కొప్పు కోటయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని శాంతి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పామూరు: పామూరులోని రమా సమేత శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం రమ, సత్యనారాయణస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రాలతో శాంతి కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామి మూల విగ్రహమూర్తులకు అర్చకులు వేద మంత్రాలతో విశిష్ట పూజలు చేశారు. కల్యాణానంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు


కనిగిరిలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీలో జడ్జి భరత్‌చంద్ర

● సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి

కందుకూరు: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు కచ్చితంగా హెల్మెట్‌లు ధరించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎ శోభారాణి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యాయమూర్తులతో పాటు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెట్‌లు ధరించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టాలను గౌరవిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ వచ్చునని తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపడం, అతివేగం నడపడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు న్యాయశాఖ తరుపున ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి పి. పూర్ణిమాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌బాబు, న్యాయ సేవా సహాయకులు పి.వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు,న్యాయవాదులుపాల్గొన్నారు.

కనిగిరి రూరల్: వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కనిగిరి కోర్టు నాయ్యమూర్తి కె.భరత్ చంద్ర అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో వాహనదారులు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ «వన్ కే వాక్» ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న మోటార్ సైకిల్ ప్రమాదాలను అరికట్టేందుకు వాహదారులు విధిగా హెల్మెట్ వాడాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రత్నాకరం రామరాజు, న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పారాలీగల్ వలంటీర్లు, న్యాయవాదుల గుమస్తాలు, వీజేత నీట్ కళాశాల విద్యార్థులు, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ బకాయిలు చెల్లించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ రఫీ

కందుకూరు: రవాణా శాఖకు చెల్లించాల్సిన ట్యాక్స్ బకాయిలను చెల్లించని వాహనాలను తనిఖీలు నిర్వహించి సీజ్ చేస్తామని, ట్రాన్స్‌పోర్టు వాహనదారులు ట్యాక్స్ బకాయిలు చెల్లించాలని కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎండీ రఫీ అన్నారు. వాహనాలను గురువారం ఆయన తనిఖీలు చేశారు. కందుకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని కందుకూరు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, ఉలవపాడు మండలాల పరిధిలో గూడ్స్ వాహనాలు 562, ట్రాక్టర్ అండ్ ట్రైలర్ పబ్లిక్ వాహనాలు 602, మ్యాక్సీ క్యాబ్‌లు 56 వాహనాలు ట్యాక్స్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. వీరికి ఇప్పటికే సమాచారం ఇచ్చామని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ట్రాన్స్‌పోర్టు వాహనదారులు తప్పనిసరిగా ట్యాక్స్, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువపత్రాలను చెల్లుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మున్సిపల్, సచివాలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మందిరంలో గురువారం సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మున్సిపల్, సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను తొలుత పరిశీలించి, ఆతర్వాత తగిన సమాధానం ఇవ్వాలన్నారు. చేయగలిగిన పనిని తక్షణం చేయాలని, లేకుంటే ఎన్ని రోజుల తర్వాత పని జరుగుతుందని అర్జీదారునికి వివరించాలని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా అర్జీదారున్ని తిప్పినా.. విధి నిర్వాహణలో బాధ్యతా రాహిత్యంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదన్నారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పరస్పర సహకారంతో, సమన్వయంతో ఉండాలన్నారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని.. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయన్నారు. అధికారులు కేవలం ఆఫీసులో కుర్చిలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. తక్షణ సమస్యల పరిష్కారంలోకూడా జాప్యతగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్యం తీవ్ర అధ్వాన్నంగా ఉందని.. ఏ వార్డులోకి వెళ్లి ప్రజలు తీవ్రంగా ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. అధికారులు బాధ్యతా రహిత్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లో నుంచి వచ్చే చెత్త చెదారం వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో వేయకుండా ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి మున్సిపల్ కార్మికులు చెత్త సేకరణ చేపట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించుటలో మెప్మా సిబ్బంది భాగస్వామ్యులై, బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్‌రావు, టీపీఓ వివేకానంద కుమార్, ఏఈ కోటేశ్వరరావు, మెప్మా సీఎంఎం రఘు, సచివాలయ, మున్సిపల్, మెప్మా పాల్గొన్నారు.

ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి


పెంట్రాల సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు

లింగసముద్రం: మండలంలోని ముత్యాలపాడు, చిన్నపవని, పెద్దపవని-1,2, పెంట్రాల సచివాలయాలను ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. ఆ గ్రామాల సచివాలయాల్లో పీఆర్ యాప్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించిన వివరాలను, రికార్డులు, రిజిష్టర్లను ఎంపీడీఓ పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రతి రోజు సకాలంలో సచివాలయాలకు చేరుకోవాలన్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. నిబద్ధతతో పని చేయాలన్నారు. అనంతరం ముత్యాలపాడులో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకును పరిశీలించారు. ట్యాంకును ఎప్పటికప్పుడు క్లోరినేషన్‌తో శుభ్రపరిచి గ్రామస్తులకు నీటిని వదలాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ సుబ్బారావు ఉన్నారు.

ఆలయ భూముల వేలం బహిరంగ వేలం

వలేటివారిపాలెం: మండలంలోని కలవళ్లలో మదన గోపాలస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల సంబంధించి భూముల గురువారం ఒక సంవత్సరం కౌలుకు వేలం నిర్వహించినట్లు ఆలయ అధికారి వంశీకృష్ణ తెలిపారు. మదనగోపాలస్వామి దేవాలయం పరిధిలోని భూమి సర్వే నం.138లో 6 ఎకరాలు పువ్వాడ మోహన్‌రావు రూ.1,41,000లకు, సర్వే నం.85-1లో 3.09 ఎకరాలు తానికొండ బ్రహ్మయ్య రూ.7,200లకు, సర్వే నెం. 112-1లో 5.3 ఎకరాలు మోదేపల్లి కోటేశ్వరరావు రూ.1,10,500లకు, సర్వే నెం. 158లో 5.5 ఎకరాలు పువ్వాడ ఆనందరావు రూ.1,18,000లకు, సర్వే నెం. 105-1లో 1.5 ఎకరాలు మోదేపల్లి విష్ణు రూ.1,500లకు, సర్వే నెం. 138లో 6.5 ఎకరాలు మోదేపల్లి మాల్యాద్రి రూ.1,84,500లకు, సర్వే నెం. 138లో 8.9 ఎకరాలు పూసాల మాల్యాద్రి రూ.1,77,500లకు పాడుకునట్లు పేర్కొన్నారు. అలాగే మల్లేశ్వరస్వామి దేవాలయం పరిధిలోని సర్వే నం. 60లో 1.9 ఎకరాలు పువ్వాడ మోహన్‌రావు రూ.38,500లకు, సర్వే నం. 60లో 3.5 ఎకరాలు పువ్వాడ మోహన్‌రావు రూ.76,000లకు, సర్వే నెం. 60లో 3.5 ఎకరాలు మొడిగొండ సుబ్బరావు రూ.76,000లకు, సర్వే నెం. 60లో 3.5 ఎకరాలు మోదేపల్లి హజరత్తయ్య రూ.61,500లకు, సర్వే నెం. 60లో 1.5 ఎకరాలు పువ్వాడ మోహన్‌రావు రూ.31,000లకు, సర్వే నెం. 60లో 3 ఎకరాలు పువ్వాడ ఆనందరావు రూ.94,000లకు, పాట దక్కించుకునట్లు ఆయన అన్నారు. ఈ పాట పై కిందటి సంవత్సరంలో పోలిస్తే రూ.1,10,700లు దేవాలయానికి నష్టం ఏర్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ స్వర్ణ నరసింహ స్పందిస్తూ పొగాకు సాగులో రైతులకు మంచి ఆదాయం వచ్చి కౌలు భూమాలకు డిమాండ్ ఉన్న సమయంలో కూడా దేవాలయం భూములకు ఇంత నష్టం ఏర్పడటం చాలా బాధపడాల్సిన విషయమని ఆయన చెప్పకొచ్చారు. ఈ వేలం పాట ఎవరికి తెలియకుండా రహస్యంగా జరిపించడంపై అధికారులపై అనేక అనుమానాలు వెల్లువెడుతున్నాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెలిగండ్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలకుమారి, మిషన్ వాత్సల్య ఏపీఓ శ్రీనివాసనాయక్ అన్నారు. మండలంలోని రామగోపాలపురంలో మిషన్ శక్తి వాత్సల్య వంద రోజులు కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రామగోపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కమలకుమారి, ఏపీఓ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి గుంతలు లేకుండా చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు దోమల ద్వారా వ్యాపించి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కృపాజ్యోతి, నారాయణమ్మ, పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు


పామూరులో జలదిస్నానానికి బయలుదేరుతున్న పీర్లు

పామూరు: పీర్ల చావిళ్ల వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు గురువారం పీర్ల స్నానంతో ముగిశాయి. ఈ సందర్భంగా పామూరులోని మార్కెట్ పీర్ల చావిడి, కందుకూరురోడ్డులలో ఉన్న పీర్లు, గోపాలపురం, సీఎస్‌పురంలో ఉన్న పీర్లకు ముజావర్‌లు, హిందూ, ముస్లింలు పూజలు చేశారు. వేకువజామున గుండందూకగా సాయంత్రం సమయంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలనడుమ పీర్లను అందంగా అలంకరించి ఆయా చావిళ్ల వద్ద నుంచి బయలుదేరి పట్టణంలోని ప్రధానవీధులలో ఊరేగింపుగా జలదిస్నానానికి పీర్లను తరలించారు. కార్యక్రమంలో హిందూ, ముస్లింసోదరులు అధికసంఖ్యలో పాల్గొనగా పీర్ల స్నానంతో మొహరం వేడుకలు ముగిశాయి.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఎన్నారై ముల్లా జిలాని రూ.10 వేల విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. జిలానీ తన తండ్రి ముల్లా బికారి జ్ఞాపకార్థం వీటిని అందజేసినట్లు ఉపాధ్యాయుడు ఎం.ప్రభాకరరెడ్డి తెలిపారు. పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసులు చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. దాత జిలానికి పాఠశాల హెచ్‌ఎం టి.సుజాత కృతజ్ఞతలు తెలిపారు. పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ స్టాల్ ప్రారంభం

కొండపి(సింగరాయకొండ)/సింగరాయకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో సబ్సిడీ స్టాల్‌ను తహసీల్దార్ కిరణ్ కుమార్ గురువారం ప్రారంభించారు. స్టాల్‌లో కేజీ కంది పప్పు రూ.160, బియ్యం కేజీ రూ.48కు అందిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, సివిల్ సప్లయిస్ డీటీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: స్థానిక నరశింహశ్రేష్ఠి అడితి బజారులో సబ్సిడీ స్టాల్‌ను తహసీల్దార్ భవానీ శంకర్ గురువారం ప్రారంభించారు. గ్రామ సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో బియ్యం, కంది పప్పు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత


ఇన్వర్టర్ అందజేస్తున్న జయరామి రెడ్డి, నారాయణరెడ్డి

పామూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సాయం అభినందనీయమని కేజీబివి ఎస్ఓ కటకం సజన అన్నారు. స్థానిక కేజీబీవీ విద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు, సింగిల్‌విండో మాజీ చైర్మన్లు పామూరు బైరెడ్డి జయరామిరెడ్డి, సీఎస్‌పురం బోయళ్ల నారాయణరెడ్డి పాఠశాలకు విరాళంగా ప్రకటించిన రూ.40 వేల విలువచేసే ఇన్వర్టర్, బ్యాటరీలను విద్యాలయం ఎస్ఓ కటకం సజనకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ కేజీబివి పాఠశాలలకు విద్యార్థినులకు వరం లాంటివన్నారు. ఏఓ వాణి, జయలక్ష్మి, దేవనబోయిన సుబ్బయ్య, మొగుళ్లూరి సుబ్రహ్మణ్యం, పోకా నాయుడు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.143

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో చూర, ముక్క గరిష్ట ధర రూ.143 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు, ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం, గ్రామాల రైతులు 538 బేళ్లు వేలానికి తీసుకురాగా 502 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 36 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.60, సరాసరి ధర రూ.98.83 పలికింది. వేలంలో 9 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషోర్‌రెడ్డి


మాట్లాడుతున్న కందుకూరు డివిజన్ వ్యవసాయాధికారి అనసూయ

హనుమంతునిపాడు: పంటసాగు హక్కు పత్రాలతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంగుంట్ల, హనుమంతాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో జరిగిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు పత్రాలపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డుల కోసం రైతు సేవా కేంద్రాల్లో ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్డులున్న వారికి పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి, ఏఓ గోపిక్రిష్ణా, వీఆర్వోలు సుబ్బయ్య, ఎంపీటీసీ తానిగుండాల తిరుపతిరెడ్డి, కోటిరెడ్డి, మాజీ సర్పంచ్, కొండారెడ్డి, కార్యదర్శులు, వీఏఏలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని పోకూరు రైతు సేవా కేంద్రంలో గురువారం వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ అధ్యక్షతన కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచలాకురాలు అనసూయ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో సంపూర్ణ మద్దత్తు ఇచ్చేందుకు అర్హులైన ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డులను అందజేయాలని రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ సహాయకులకు ఆమె సూచించారు. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ సాంకేతిక వ్యవసాయ అధికారి దుర్గ, ఉద్యానవన సహాయకులు సుష్మ, ఖాదార్‌బాషా, రెవెన్యూ అధికారి హరికృష్ణ, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలి


బ్యాటరీ సైకిల్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కందుకూరు: దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో వ్యవహరించడంతో పాటు, సంపాదనలో కొంత భాగంగా వారి కోసం ఖర్చు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల కేంద్రంలో గురువారం సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరీ సైకిల్‌లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా దివ్యాంగులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. సక్షమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెన్నా రామాంజనేయులు మాట్లాడుతూ 8 మందికి ఒక్కొక్కరికి రూ.40వేల విలువ చేసే బ్యాటరీ ట్రై సైకిల్‌లు, ఐదుగురికి రూ.10వేల విలువైన వీల్‌చైర్‌లు, ఆరుగురికి వినికిడి యంత్రాలు, చంక కర్రలు, హెల్మెట్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సంఘచాలక్, హరిణి వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ తన్నీరు మల్లికార్జున, స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బోధన మెరుగుపర్చేందుకు టీచ్ టూల్ శిక్షణ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వం ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ నిర్వహిస్తుందని డిప్యూటీ డీఈఓ ఎంవీవీ ప్రసాదరావు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజుల పాటు జరిగే టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమం ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు. ఈ శిక్షణ మెరుగైన విద్యాబోధన చేయడంలో ఉపాధ్యాయులకు అవసరమైన మెళకువలను అలవర్చడంతో పాటు, బోదన సామర్థ్యాన్ని మరింత పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎంఈఓ మల్లిఖార్జున, ప్రధానోపాధ్యాయులు ఎం నరశింహమూర్తి, శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై కందిపప్పు, బియ్యం


ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన తహసీల్దార్ కిషోర్‌రెడ్డి


నిత్యావసరాలు అందిస్తున్న తహసీల్దార్ పద్మావతి

హనుమంతునిపాడు: సబ్సిడీపై కందిపప్పు, బియ్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ కిషోర్‌రెడ్డి ప్రారంభించారు. కందిపప్పు రూ.160, బియ్యం రూ.49లకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీసీపల్లి: సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కేంద్రాన్ని తహసీల్దార్ పద్మావతి ప్రారంభించారు. ఎంపీడీఓ సుబ్బారావు, పంచాయతీ అధికారులు, వేమూరి రామయ్య, పెద్దన్న, కడప ఓబులరెడ్డి, మాచర్ల వీరయ్య, మూలె సత్యంరెడ్డి పాల్గొన్నారు.

పంట సాగుపై కౌలు రైతులకు అవగాహన


కౌలు రైతులతో మాట్లాడుతున్న ఏఓ పూర్ణచంద్రరావు

పొన్నలూరు: మండలంలోని కోటపాడు గ్రామంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై గురువారం అవగాహన కల్పించారు. ఏఓ టి.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. కౌలు కార్డు కలిగిన రైతులకు భూ యజమానితో సమానంగా ఈ క్రాప్ నమోదు, రాయితీ విత్తనాలు, పంటల బీమా, పంట రుణాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల వ్యవసాయ పథకాలకు అర్హులవుతారని చెప్పారు. కౌలు రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండారెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.